క్లుప్తంగా

రైలు ప్రయాణికురాలి మెడలో గొలుసు అపహరణ

మంగళగిరి: రైలులో ప్రయాణిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును ఓ దుండగుడు లాక్కెళ్లిన ఘటన శనివారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ నుంచి హుబ్లీ వెళ్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు మంగళగిరి దాటగానే ఎస్–2 బోగిలో ప్రయాణిస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును అదే బోగీలో ఉన్న దుండగుడు లాక్కొని రైలు నుంచి దూకి పారిపోయాడు. అప్రమత్తమైన తోటి ప్రయాణికులు రైలు చైన్ లాగి ఆపి రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. టీసీ వివరాలు సేకరించి గుంటూరులోని రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనస్థలంలో వివరాలు సేకరించి జాగిలంతో తనిఖీలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డేశ్వరంలో కార్డన్ సెర్చ్

హాస్టళ్లలో పోలీసుల విస్తృత తనిఖీలు



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఆదేశాల మేరకు డీఎస్పీ రాంబాబు పర్యవేక్షణలో తాడేపల్లి సీఐలు శేషగిరిరావు, సాంబశివరావు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున వడ్డేశ్వరంలోని ప్రైవేటు హాస్టళ్లలో ఆరు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టారు. చాలా హాస్టళ్లలో ఖాళీ మద్యం బాటిళ్లు కనిపించడంతో విద్యార్థులందరికీ తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించడం వల్ల తలెత్తే అనర్థాల గురించి వివరించారు. తనిఖీల్లో ఎస్‌ఐలు రమేష్, నారాయణ, శ్రీనివాసరావు, 30 మంది సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



మంగళగిరి: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఆదివారం జరిగిన 18వ రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో నగరంలోని సీకే జూనియర్ కళాశాల విద్యార్థి ఎం.మధుబాబు ప్రతిభను చాటినట్లు కోచ్ కృష్ణమోహన్ తెలిపారు. మధుబాబు అండర్ –18 విభాగంలో 110 మీటర్ల హర్డిల్స్‌లో తృతీయ స్థానం, 400 మీటర్ల హర్డిల్స్‌లో తృతీయ స్థానాలను సాధించాడు. మధుబాబుకు సీకే జూనియర్ కళాశాల సెక్రటరీ జంజనం పాండు రంగారావుతోపాటు పలువురు కళాశాల అధ్యాపకులు, విజేత స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పీవీఎస్‌బీ సత్యనారాయణ, ఐ.వెంకట్రావు, షేక్ ఖలీల్, బత్తుల సాంబశివరావు, బాజి ఖాన్, రుద్రు రవికుమార్, అక్బర్, ఖాజా అభినందనలు తెలిపారు.

చర్చి ఆధ్వర్యంలో చీరల పంపిణీ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పోలకంపాడు క్వారీలో ఉన్న షాలోమ్ చర్చి ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ కె.రమేష్ మాట్లాడుతూ ఫోర్ కార్నర్ ఇండియా ట్రస్ట్ వారి సౌజన్యంతో 200 మంది పేద మహిళలకు ఈ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించామని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంస్థ చైర్మన్ బి.ప్రేమ్‌కుమార్, విశ్రాంత ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్ దేవీప్రసాద్, సత్యవేడు మాజీ శాసన సభ్యులు ఎం.సి.సురాజన్, సుప్రీంకోర్టు అడ్వకేట్ కె.అరుణ్‌కుమార్ విచ్చేసి చీరల పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు ఆట బొమ్మలను అందజేశారు.

మందుబాబులపై కేసులు



తెనాలి రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం గ్రామాల్లో డొంకలు, పొలాల గట్ల వెంబడి, చినపరిమి డొంక రోడ్డు, ఇతర ప్రదేశాల్లో బహిరంగంగా మద్యం తాగుతున్న 10 మందిని రూరల్ ఎస్‌ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు ఆదివారం గుర్తించారు. అందరూ ఆటో డ్రైవర్లే కావడంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారిపై న్యూసెన్స్ కేసులు నమోదు చేశారు.

అందాల బృందావనం

ప్రకృతి సోయగాల మధ్య.. సుందర గిరుల నడుమ.. మనసును కట్టిపడేసే సుమనోహర దృశ్యాలు.. హరితవర్ణ శోభితమై మెరిసే అపురూప వృక్ష సంపద.. చెక్కిళ్లను సుతారంగా తాకే తెమ్మెరలు.. లయబద్ధంగా వీనుల విందు చేసే పక్షుల కిలకిలారావాలు.. చిన్నారులను రంజింపజేసే ఆట వస్తువులు.. సాహసికుల మదిని దోచే ట్రెక్కింగ్ మధురానుభూతులు.. వీటన్నింటినీ ఆస్వాదించాలంటే ఓసారి మంగళగిరిలో కొలువుదీరిన నగరవనం (టెంపుల్ హిల్ ఎకో పార్కు)ను సందర్శించాల్సిందే. ఈ అందాల వనం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది.



పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు



ట్రెక్కింగ్ ట్రాక్‌లో అటవీ అధికారులు (ఫైల్)

- నగర వనానికి నవ్య శోభ
- రూ.40 లక్షలతో ఆధునిక హంగులు
- ట్రెక్కింగ్ ట్రాక్ నిర్మాణం
- చిన్నారులకు ఆటవిడుపు

మంగళగిరి: పానకాల లక్ష్మీనృసింహస్వామి ఎగువ సన్నిధిని ఆనుకుని, నగరంలోని ఎయిమ్స్ ఆస్పత్రి పక్కన రెండు కొండల మధ్య అటవీ శాఖ ఆధ్వర్యంలో నగర వనం ఏర్పాటైంది. దీనిని అధికారులు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. విజయవాడ, గుంటూరు మధ్యలో ఉన్న మంగళగిరి–తాడేపల్లి నగరంలో మూడు నగరాల వాసులకు ఆరోగ్యం.. ఆహ్లాదం అందించేలా రూ.40 లక్షలు వెచ్చించి 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ అందాల బృందావనాన్ని ఆవిష్కరించారు. చిన్నారుల కోసం ఆట వస్తువులు, పెద్దల కోసం వ్యాయామశాల, సేదదీరేందుకు ప్రత్యేక కుటీరాలు ఏర్పాటు చేశారు. నక్షత్ర వనం, నవగ్రహ వనం, రాశివనం, పంచవటిల పేర్లతో ఔషధ మొక్కలను పెంచుతున్నారు. ఇక్కడ ఐదు కిలోమీటర్ల మేర వేసిన పర్వతారోహణ మార్గం అరకును తలపిస్తుందంటే అతిశయోక్తి కాదు. కొండపై నడక కోసం రెండు కిలోమీటర్ల మేర ట్రాక్ నిర్మించారు.



టెంపుల్ హిల్ ఏకో పార్కు(నగర వనం) ముఖద్వారం



నక్షత్రవనంలో ఔషధ మొక్కలు



పర్యాటకులు సేదదీరేందుకు తీర్చిదిద్దిన కుటీరం



బాలల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు



పర్వతారోహకులు సేదదీరేందుకు ఏర్పాటు చేసిన బల్లలు

చెరువులకు జలకళ



నీటితో నిండుగా ఉన్న ఫిరంగిపురం చెరువు

ఫిరంగిపురం: వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందుగా సాగర్ నీటిని విడుదల చేసింది. ఫలితంగా మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు కళకళలాడుతున్నాయి. సాగర్ నీటిని వారం రోజుల కిందటే విడుదల చేయడంతో అన్ని గ్రామాల్లోని చెరువులను నింపుకోవాలని ఆదేశించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఫిరంగిపురంలోని సమగ్ర మంచినీటి పథకం ద్వారా శిరంగిపాలెం, అల్లంవారిపాలెం, 113 తాళ్లూరు, నుదురుపాడు, కండ్రిక, తక్కెళ్లపాడు, గరుడాచలపాలెం, హౌస్‌గణేష్, రేపూడి, వేమవరం, గొల్లపాలెం గ్రామాల ప్రజల అవసరాలు తీరుతాయని చెప్పారు. బేతపూడి, మునగపాడు, గుండలపాడు గ్రామాలతో పాటుగా మేరికపూడి గ్రామాల్లో చెరువులను నీటితో నింపేలా చూడాలని ఆయా గ్రామాల సర్పంచులకు చెప్పామని పేర్కొన్నారు. మార్చి 10 వరకు నీరు విడుదలవుతుందని చెప్పారు.

విశ్రాంత ప్రిన్సిపాల్ సత్యబాబుకు ఘన నివాళి



సత్యబాబు చిత్రపటం వద్ద ప్రముఖుల నివాళి

తెనాలి: విద్యా బోధకుడిగా, సామాజిక, ఆధ్యాత్మిక సేవకుడిగా జీవితాన్ని గడిపిన విశ్రాంత ప్రిన్సిపాల్ పొణుకుమాటి సత్యబాబు మానవతకు ప్రతిరూపమని వక్తలు కొనియాడారు. ఆదివారం జరిగిన సంస్మరణ సభకు అధ్యాపక ప్రముఖుడు బలహారనాథమూర్తి అధ్యక్షత వహించారు. హిందూ పత్రిక విశ్రాంత పాత్రికేయుడు ఆర్.సంపత్ మాట్లాడుతూ నాయుడమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా విశిష్ట శాస్త్రవేత్తకు ప్రదానం చేసే అవార్డు బహూకరణ ఉత్సవానికి సత్యబాబుకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.విష్ణుమూర్తి మరణం తర్వాత ఆ ట్రస్ట్‌ను కేంద్ర చర్మపరిశోధన సంస్థ, చెన్నైలో విలీనం చేసేందుకు సత్యబాబు చేసిన కృషిని బలహరినాథమూర్తి, ఆడిటర్ వెంకట్రావు వెల్లడించారు. వైకుంఠపురం దేవస్థానం, దేవీచౌక్‌లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానాల్లో సంకీర్తనలు, కార్యక్రమాల నిర్వహణలో ఆధ్యాత్మిక సేవకుడిగా సత్యబాబు పాత్రను పలువురు గుర్తు చేశారు. బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక కార్యదర్శిగా పాతికేళ్లుగా ఆయన నిస్వార్థ సేవను పలువురు స్మరించుకున్నారు. కామర్స్ బోధనలో పట్టణంలో సత్యబాబుకు మరొకరు సాటిరారని విశ్రాంత ప్రిన్సిపాల్ నాగిరెడ్డి తెలిపారు. మహేంద్ర స్వాగతం పలికిన సభలో విశ్రాంత ప్రిన్సిపాల్ వింతా మోహనరెడ్డి, వివిధ రంగాల ప్రముఖులు అర్జునరావు, జి.ఆంజనేయశాస్త్రి, కొండపి శ్రీనివాసరావు, బాలరాజు, పరుచూరి సుబ్బా రావు, వెంకటరత్నం, గంగాధరరావు, సుబ్బారావు, భారతి, భాస్కర్ మాట్లాడారు. కార్యక్రమాన్ని ఉషారాణి, పద్మావతి, గోవిందు పర్యవేక్షించారు.

విజ్ఞాన ప్రదర్శనకు విశేష స్పందన



నమూనాలను పరిశీలిస్తున్న అతిథులు

తెనాలి అర్బన్: బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూలులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మాంటిస్సోరి గాట్ టాలెంట్ ప్రదర్శనకు ఆదివారం విశేష స్పందన లభించింది. ఉదయం తొమ్మిది గంటలకు స్కూలు ప్రిన్సిపాల్ జేమ్స్ మోర్లే ప్రారంభించారు. తెనాలి పట్టణ, రూరల్ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలోని నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్, అధ్యాపకులు సంజీవ్‌బాబు, వి.సరోజ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న నరేంద్రకుమార్, డాక్టర్ ఉమ

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు గోగినేని హరిప్రసాదరావు స్మారకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం ప్రతిభావంతుడైన విద్యార్థికి ఉన్నత చదువుల నిమిత్తం రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. హరిప్రసాదరావు కుమారుడు డాక్టర్ గోగినేని లక్ష్మీప్రసాద్, కోడలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, మనుమడు సందీప్‌బాబు కొత్తపేటలోని నివాసంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఐటీ సీఎస్‌సీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎన్టీఆర్ జిల్లా గురజ గ్రామానికి చెందిన జాస్తి యశ్వంత్‌కు రూ.లక్షను సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభకు పురస్కారం పేరుతో పేదరికంలో ఉన్న విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని చెప్పారు. దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ మాట్లాడుతూ డాక్టర్ గోగినేని హరిప్రసాదరావు జ్ఞాపకార్థం ప్రతిభావంతులైన విద్యార్థులకు ఏటా ఉపకార వేతనాలను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సూర్యదేవర వెంకటరమణ, గోగినేని బుల్లిప్రసాద్, తాడిబోయిన శ్రీనివాసరావు, గుమ్మడి రమేష్, నేలటూరి బెన్ను, చెరుకూరి సుబ్బారావు, కొడాలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీలకు అండగా ఉంటున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని చెప్పారు. ఆదివారం దుగ్గిరాలలోని ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమం గురించి మాట్లాడే అర్హత టీడీపీ నాయకుడు లోకేష్‌కు లేదన్నారు. టీడీపీ హయాంలో ఎంతమంది మైనార్టీలకు మేలు చేశారో ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. గత పాలనలో ముస్లింల అభివృద్ధికి కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని పేర్కొన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం కల్పిస్తే, ఆయన తనయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి అన్ని రంగాల్లో మైనార్టీలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. సమావేశంలో మైనార్టీ నేతలు పఠాన్ మస్తాన్ ఖాన్, షేక్ రషీద్ సాహెబ్, సయ్యద్ జానీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యం

పార్టీ అనుబంధ సంఘాల నాయకులకు సన్మానం



కొత్తగా నియమితులైన వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల నాయకులను అభినందిస్తున్న దృశ్యం

మంగళగిరి: వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామని, మంగళగిరి నియోజకవర్గాన్ని వైఎస్సార్ సీపీ కంచుకోటగా మార్చడమే తమ ధ్యేయమని కొత్తగా నియమితులైన ఆ పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ బీసీ విభాగం, ఎస్టీ విభాగం అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), మేడా వెంకటేశ్వరరావు(పండు) తెలిపారు. కొత్తగా నియమితులైన ఆయా విభాగాల అధ్యక్షులను ఆదివారం నగర పరిధిలోని ఆటోనగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, టీమ్ ఆర్కే సభ్యులు, సోషల్ మీడియా కన్వీనర్లు, నగర సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. వారు మాట్లాడుతూ పార్టీ కష్టపడిన ప్రతి కార్యకర్తనూ గుర్తిస్తుందన్నారు. రానున్న రోజులలో ప్రతి నాయకుడూ, కార్యకర్త మరింత కష్టపడి పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీమ్ ఆర్కే సభ్యులు, సోషల్ మీడియా కన్వీనర్లు మేకా వెంకటరామిరెడ్డి, వ్యాసం అజయ్, ఇంద్ర, బలసాని అనిల్, అంజి, తోట శ్రీను, నగర సంఘం నాయకులు పందేటి సాంబశివరావు, జాగ్రు ఏడుకొండలు, గండికోట అచ్చెయ్య,కఠారి వెంకటేశ్వరరావు, కలవకొల్లు గోపిబాబు, నంద్యాల గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఫిరంగిపురం: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి ఆదివారం మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. ద్విచక్రవాహనంపై వెళ్తున్న రఫీ(25)ని అమీనాబాద్ సమీపంలోని మల్కాచెరువు వద్ద ఆదివారం తెల్లవారుజామున టిప్పర్ ఢీకొంది. ఘటనలో రఫీ తీవ్రంగా గాయపడ్డాడు. రఫీని 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

ఆశాజనకంగా రబీ



తాడికొండ మండలంలో ఏపుగా పెరిగిన జొన్న పంట

తాడికొండ: ఈ ఏడాది రబీలో వాతావరణం అనుకూలించడంతో శనగ, జొన్న, మినుము, పెసర పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. సాగునీటికి ఢోకా లేకపోవడంతో దిగుబడి కొంతమేర పెరుగుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జొన్న మద్దతు ధర క్వింటాకు రూ.4,300 ఇస్తుండటంతో ఈ ఏడాది అధిక సంఖ్యలో రైతులు ఆ పంటను సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో ఎకరాకు 13–15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుండటంతో సంతోషపడుతున్నారు. బహిరంగ మార్కెట్లో శనగకు రూ.4,250 వరకు ధర పలుకుతుండగా ప్రభుత్వం రూ.5,335కి కొనుగోలు చేసేందుకు మార్కెటింగ్ శాఖ ద్వారా కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తోంది. దీంతో శనగ రైతులు ఆనందంగా ఉన్నారు. గతేడాది రూ.5,230గా ఉన్న మద్దతు ధరను ప్రభుత్వం మరో 105 రూపాయలు పెంచడం ఊరట నిచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పంటను అమ్మాలంటే తప్పనిసరిగా ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంది. అయితే దీనిపై అవగాహన లేక కర్షకులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వారిని చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది.

కరాటే పోటీల్లో భవ్యేష్‌వర్మకు రజత పతకం



తెనాలి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి కరాటే ఇన్విటేషనల్ చాంపియన్ షిప్– 2023 పోటీల్లో తమ విద్యార్థి జంపని భవ్యేష్ వర్మ రజత పతకం సాధించినట్లు మైటీ స్పోర్ట్స్ అకాడమి జనరల్ సెక్రటరీ గుర్రం అనిల్‌కుమార్ తెలిపారు. పోటీల్ని ఒంగోలులో ఆదివారం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. రజత పతకం సాధించిన భవ్యేష్ వర్మను సోమవారం ఆయన పట్టణంలోని అకాడమిలో అభినందించారు.

విలక్షణ నటుడు ఎన్టీఆర్



తెనాలి అర్బన్: విలక్షణ నటుడు ఎన్టీ రామారావు అని మాచినేని వెంకటేశ్వరరావు, పులిపాక శ్రీకర్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది పాటు ఆడిన ఎన్టీఆర్ సినిమాలపై వారు ప్రసంగించారు. అనంతరం వక్తలతో పాటు ప్రముఖ సంగీత కళాకారుడు ముక్కాల మాణిక్యరావును సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, వెలగా సుభాష్‌చంద్రబోసు, దేవరపల్లి నీలాంబరం, కంచర్ల ఏడుకొండలు, సూర్యదేవర సత్యనారాయణ, బడుగు మోహనరావు పాల్గొన్నారు.

జీవనశైలి వల్ల వచ్చే వ్యాధులతో జాగ్రత్త

తెనాలి: జీవన శైలి వల్ల వచ్చే వ్యాధులతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని పట్టణానికి చెందిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ హర్ష మందలపు సూచించారు. నియమబద్ధ జీవనంతో వీటినుంచి దూరంగా ఉండొచ్చని సూచించారు. వాకర్స్ క్లబ్ ఫిబ్రవరి సమావేశాన్ని ఆదివారం ఉదయం కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో నిర్వహించారు. క్లబ్ ఉపాధ్యక్షుడు కాకుమాను రామమోహనరావు అధ్యక్షత వహించారు. 'జెర్డ్, గ్యాస్ట్రయిటిస్, కాలేయంలో కొవ్వు చేరటం' తదితర వ్యాధులపై డాక్టర్ హర్ష మందలపు ప్రసంగించారు. ఆ వ్యాధులు ఒక్కరోజులో వచ్చేవి కాదన్నారు. ఏళ్ల తరబడి కారం, మసాలాలు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం, పొగ, ఆల్కహాల్ తాగడం వల్ల వస్తాయని చెప్పారు. ఎక్కువ కాలం మందులు వాడకుండా, ఆహార నియమాలు పాటించకుండా, సరైన వ్యాయామం చేయకపోతే కొంత కాలానికి అల్సర్ ఏర్పడుతుందని వివరించారు. కాలేయానికి సిరోసిస్ అనే వ్యాధి సోకుతుందని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారు డాక్టర్‌కు చూపించుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. క్లబ్ కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికారు. తొలుత వాకర్స్‌కు షుగరు, బీపీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో అచ్చయ్య, అశోక్, రత్తయ్య, సత్యనారాయణ, నరేంద్ర పాల్గొన్నారు.

ఆధునిక సాహిత్యంలో హాస్యానికి ప్రత్యేక స్థానం

తెనాలి అర్బన్: ఆధునిక సాహిత్యంలో హాస్యానికి ప్రత్యేక స్థానం ఉందని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రచయిత పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెనాలి సమావేశాన్ని ఆదివారం సాయంత్రం కవిరాజా పార్కులోని వడ్లమూడి గోపాలకృష్ణయ్య స్మారక సీనియర్ సిటిజన్స్ భవనంలో నిర్వహించారు. సాహిత్యం–హాస్యం అనే అంశంపై గోపాలకృష్ణమూర్తి ప్రసంగించారు. అనంతరం ఆయన్ను సన్మానించారు.